
సాక్షి ఒడిశా
సోమవారం । 18 । మార్చి । 2024



**శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు**
నగదు రూ. 2,84,972
బంగారం 20 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



**జన జాతర** - 8లో
బరంపురం, జయపురంలో ఆదివారం జామి ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. భారీగా భక్తులు తరలివచ్చారు.



| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| సోమ (సా॥) | మంగళ (ఉ॥) |
| 6.02 | 4.38 |

**రంజాన్ వేళలు**

## న్యూస్‌రీల్

### నేటి నుంచి నీలావడి అగ్నిగంగమ్మ జాతర



నీలావడి అమ్మవారు

**రాయగడ:** ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న నీలావడి అగ్నిగంగమ్మ వార్షిక జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటుగా జరిగే ఈ జాతరను తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహక కమిటీ కార్యదర్శి రవిశంకర్ తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారి పాదాలను తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వేంచింపజేసి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో చివరి రోజు అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు సుమారు లక్ష మందికి పైగా భక్తులు ఇటు పార్వతీపురం మన్యం జిల్లా, బొబ్బిలి తదితర ప్రాంతాలతో ఒడిశాలోని రాయగడ, గుణుపూర్, కళ్యాణసింగుపూర్, మునిగుడ, కొరాపుట్, జయపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ నెల 26వ తేదితో అమ్మవారి జాతర ముగుస్తుంది.

### రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న పోలీసులు

**మల్కన్‌గిరి:** రక్తదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మల్కన్‌గిరి ఎస్పీ నీతిష్ వాద్వానీ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం ఎస్పీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. 98 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం అవసరమవుతుందని, అందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ తపన్ నారాయణ్ రథో, మల్కన్‌గిరి రెడ్‌క్రాస్ వైద్యులు సాగర్ బాలా తదితరులు పాల్గొన్నారు.

### ఆరు బైకులు సీజ్



అరెస్టయిన నిందితులతో పోలీసులు

**బరంపురం:** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కె.నువాగాం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఆరు బైకులు సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు సదర్ ఎస్‌డీపీఓ బిష్ణు ప్రసాద్ పాత్రో తెలిపారు. బైక్‌ల దోపిడీ ముఠాలపై మాటు వేసి పట్టుకున్నట్లు చెప్పారు. అరెస్టయిన వారిలో ఖుర్దా జిల్లా గోపాల్‌పూర్‌కి చెందిన శంకర్ శెట్టి, ఆర్.ప్రవీణ్‌రెడ్డి, ఎస్.శివశంకర్ రెడ్డిలుగా గుర్తించినట్లు వెల్లడించారు.

### జీఎస్‌టీ అధికారుల దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న జీఎస్‌టీ అధికారులు

**రాయగడ:** స్థానిక న్యూకాలనీలోని ఫెయర్ డీల్ కార్పొరేషన్ అనే హార్డ్‌వేర్ దుకాణంలో జీఎస్‌టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. జీఎస్‌టీ పన్నులను ఎగవేస్తున్నారన్న ఆరోపణలపై ఈ దాడులు నిర్వహించినట్లు జీఎస్‌టీ డిప్యూటీ కమిషనర్ తుఫాన్ బిమాల్ తెలిపారు. ఈయన నేతృత్వంలో ఐదుగురితో కూడిన బృందం ఈ దాడుల్లో పాల్గొంది. సుమారు ఏడు గంటల పాటు ఏకధాటిగా అధికారులు దుకాణంలో తనిఖీలు చేపట్టి 2018 నుంచి పన్నులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి తమ వెంట తీసుకెళ్లారు. వేరే ప్రాంతంలో ఉన్న గోదామును పరిశీలించి స్టాక్‌పై ఆరా తీశారు. పూర్తిస్థాయి తనిఖీలు అనంతరం చర్యలు తీసుకుంటామని బిమాల్ తెలిపారు.

# ఒడిశా ఓటర్లు 3.35 కోట్లు

- అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నికుంజ బిహారి ధొలొ



నికుంజ బిహారి ధొలొ, సీఈఓ



**భువనేశ్వర్:** రాష్ట్రంలో నాలుగు విడతల్లో లోక్‌సభ, శాసన సభకు ఎన్నికలు జరగనున్నాయని, మొత్తం 3.35 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) నికుంజ బిహారి ధొలొ వెల్లడించారు. మే 13 నుంచి జూన్ 1 వరకు 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ నాలుగు దశల్లో జరగనున్న ఎన్నికల్లో ఈ ఏడాది జనవరి నెల మొదటి వారంలో తుది ఓటర్ల జాబితా విడుదల చేసే సమయానికి 3,32,36,360గా ఉన్న రాష్ట్ర ఓటర్ల సంఖ్య ఇప్పుడు 3,34,73,561కి చేరిందని వివరించారు. జాబితాను నిరంతరం అప్‌డేట్ చేయడం వల్ల ప్రతి 1000 మంది పురుష ఓటర్లకు మహిళా ఓటర్ల సంఖ్య 974కి పెరిగిందని సీఈఓ తెలిపారు. గతంలో ఈ అనుపాతం 972కి పరిమితంగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం 1.69 కోట్ల మంది పురుషులు, 1.65 కోట్ల మంది మహిళా ఓటర్లు త్వరలో జరగనున్న ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. రాష్ట్రంలో 100 శాతం ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఫొటో గుర్తింపు కార్డులు (ఎపిక్) జారీ చేసినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో 3,438 మంది థర్డ్ జెండర్, 5.19 లక్షల మంది దివ్యాంగులు, 85 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు గల 3.02 లక్షల మంది సీనియర్ సిటిజన్లు, 49,599 మంది సర్వీసు ఓటర్లు, విదేశాల నుంచి 184 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. 18–19 ఏళ్ల యువ ఓటర్ల సంఖ్య 8 లక్షలకు చేరుకుని రాష్ట్రంలో రికార్డు నెలకొలిపిందన్నారు. మొత్తం ఓట్లలో 2.38 శాతం ఈ వర్గపు ఓటర్లు ఉన్నారని, జాతీయ సగటు కంటే అధికమని నికుంజ తెలిపారు.

**ఓటరు కార్డు లేకున్నా..**

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఫొటో ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే పరిమితం కాదని నికుంజ స్పష్టం చేశారు. ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, దివ్యాంగుల గుర్తింపు కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డ్‌లతో సహా 12 ప్రత్యామ్నాయ చెల్లుబాటు అయ్యే పత్రాలలో ఏదైనా ఓటు వేసేందుకు గుర్తింపుగా పరిగణిస్తామని చెప్పారు. ఉద్యోగులు, బ్యాంకులు, పోస్టాఫీసులు జారీ చేసిన ఫోటోలతో కూడిన పాస్‌బుక్‌లు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఇండియన్ పాస్‌పోర్ట్, ఎన్‌పీఆర్ జారీ చేసిన స్మార్ట్ కార్డ్, ఫొటోగ్రాఫ్‌లతో కూడిన పెన్షన్ పత్రాలు, గ్రామీణ ఉపాధి హామీ గుర్తింపు కార్డులు వంటివి చెల్లుబాటుగా పరిగణిస్తారని సీఈఓ వివరించారు.

### గ్రీవెన్స్‌ సెల్ బంద్

**భువనేశ్వర్:** ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఎన్నికల నియమ నిబంధనలు (ఎంసీసీ) అమల్లోకి రావడంతో రాష్ట్రంలో నిర్వహించే ప్రజాభియోగాల ప్రక్రియ(గ్రీవెన్స్‌సెల్) తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా ప్రకటించారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రంగా పూర్తి అయ్యే వరకు ఈ నిలుపుదల నిరవధికంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విచారణను ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వాయిదా వేసినట్లు తెలిపారు.

### హోర్డింగుల తొలగింపు షురూ..

**జయపురం:** ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వివిధ పార్టీలకు చెందిన హోర్డింగులు, ఫ్లెక్సీలు, బ్యానర్లను అధికారులు ఆదివారం తొలగించారు. జయపురంలో బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అనేక హోర్డింగ్‌లను బుల్‌డోజర్ల సాయంతో తీసివేశారు.




జయపురంలో బీజేపీ హోర్డింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం

## రాయగడలో 883 పోలింగ్ కేంద్రాలు



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్. పక్కనే ఎస్పీ హరీష్, అధికారులు

**రాయగడ:** మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలను చేపడుతోందని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై ఆదివారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయగడ జిల్లాలో 883 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గుణుపూర్ శాసన సభ నియోజకవర్గంలో 289, బిసంకటక్‌లో 293, రాయగడ శాసన సభ నియోజకవర్గ పరిధిలో 301 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని మూడు శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 7,04,503 మంది ఓటర్లు ఉండగా ఇందులో 3,31,844 మంది పురుషులు, 3,72,474 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అందరూ ఓటు వేసేలా పత్రికలు, సామాజిక మాధ్యమాలు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఆదివాసీ, హరిజన జిల్లాగా గుర్తింపు పొందిన ఈ జిల్లాలో జనాల్లో సామాజిక చైతన్యం తీసుకురావాలన్నారు. గత ఎన్నికల్లో డొంగిరియా ప్రాంతంలో బ్యాలెట్ బాక్సులను ఎత్తుకుపోయిన నేపథ్యంలో అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హరీష్ బిసి చెప్పారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా పూర్తిస్థాయిలో బలగాలను రంగంలోకి దించుతామన్నారు. సమావేశంలో రాయగడ సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రా దేవి, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్, జిల్లా అదనపు మెజిస్ట్రేట్ భాస్కర రైతా, ఏడీఎం త్రినాథ్ మాఝి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరా తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా సహకరించాలని అధికారులు కోరారు.

## శాంతియుతంగా ఎన్నికలు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్

**బరంపురం:** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసు యంత్రాంగం పనిచేయాలని బరంపురం ఎస్పీ డాక్టర్ సార్వణ్ వివేక్ అన్నారు. దక్షిణాంచల్ ఐజీ కార్యాలయ సమావేశ మందిరంలో బరంపురం ఎస్పీ వివేక్ అధ్యక్షతన ఏఎస్పీ, డీఎస్పీ, ఐఐసీ పోలీసు అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు, చట్టానికి, వ్యవస్థకు అనుగుణంగా, జవాబుదారీగా పనిచేయాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన గంజాం, గజపతి, బౌద్, కొంధమాల్, నయగడ్, రాయగడ, మల్కన్‌గిరి, నవరంగపూర్, కొరాపుట్, కలాహండి జిల్లాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆమ్ పోలీస్ ద్వారా ప్రజలకు చేరువై సమస్యలు తెలుసుకోవాలన్నారు. పాత నేరస్తులు, బెయిలుపై బయట ఉన్నవారిపై నిఘా ఉంచాలని సూచించారు. అపరాధి ముక్తి అభియాన్ ఆపరేషన్‌ను మరింత సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు.



హాజరైన పోలీసు అధికారులు

## కలిసికట్టుగా ఉగాది వేడుకలు



పాల్గొన్న తెలుగు సంస్థలు, సంఘాల ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న నెక్కంటి భాస్కరరావు

**రాయగడ:** ఏప్రిల్ 9న ఉగాది వేడుకలను ఈసారి కూడా కలిసికట్టుగా నిర్వహిద్దామని ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. ఆదివారం తన నివాసంలో పట్టణ ప్రముఖులు, తెలుగు సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా సమైక్యంగా వేడుకలు నిర్వహిద్దామన్నారు. తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సారి కూడా రెండు రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో కొత్త కమిటీ ఏర్పాటైన తరువాత కార్యక్రమాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తలి మండలి అధ్యక్షుడు చంద్రమౌళి కుముంధాన్ మాట్లాడుతూ ఐక్యతను చాటుకునే పండగల్లో ఉగాది ఒకటని తెలిపారు. గత ఏడాది అనివార్య కారణాల వల్ల రెండు వేదికలపై ఉత్సవాలు జరుపుకోవాల్సి వచ్చిందని, ఈసారి ఒకేచోట నిర్వహిద్దామని చెప్పారు. తెలుగు ప్రజలతో పాటు ఒడియా మిత్రులను కూడా ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్‌లోనే ఒడియా సోదరులు జరుపుకునే పాణా సంక్రాంతి వేడుకలకు మనల్ని కూడా వారు ఆహ్వానిస్తున్నారని గుర్తు చేశారు. ఇదే సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. సమావేశంలో పట్టణ ప్రముఖులు శిల్లా జగన్నాథ స్వామి, పి.వి.పి.రాము, సీర రమణ, ఇప్పిలి సన్యాసిరాజు, కౌన్సిలర్ బార్జి జగన్‌మోహన్ రావు, బార్జి ప్రసాదరావు, లోకేష్ మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

**మల్కన్‌గిరి:** ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మల్కన్‌గిరి కలెక్టర్ సచిన్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆదివారం జిల్లా స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న గోడలపై ఎన్నికల పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించాలని, రాతలు ఉంటే సున్నం వేసి చెరిపి వేయాలని ఆదేశించారు. ప్రచార ర్యాలీలకు సంబంధించి ముందుగా దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లో అనుమతి ఇస్తామని చెప్పారు. ఎటువంటి సమాచారం కావాలన్నా 1950 నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. జిల్లాలో 41 పోలింగ్ బూత్‌ల పరిధిలో 3918 మంది పోలింగ్ అధికారులు విధులు నిర్వహిస్తారని వివరించారు.

## 280 కిలోల గంజాయి సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయితో బరంపురం అబ్కారీ అధికారులు

**బరంపురం:** గంజాం జిల్లా భంజనగర్ చరిచొక్కో జంక్షన్ వద్ద 56వ నంబర్ జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టగా వ్యాన్‌లో 265 కిలోల గంజాయిని గుర్తించినట్లు బరంపురం ఎక్సైజ్ ఎస్పీ రమేంద్రనాయక్ వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు అబ్కారీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. 25 బస్తాల్లో గంజాయిని సీజ్ చేసి నిందిత డ్రైవర్ నారాయణ రౌత్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.50 లక్షలు ఉంటుందన్నారు. ఆదివారం మధ్యాహ్నం బరంపురం రైల్వే స్టేషన్ వద్ద భువనేశ్వర్‌కు అక్రమంగా తరలిస్తున్న 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని గంజాం జిల్లా సురడా గ్రామానికి చెందన సంతోషకుమార్ నాయక్‌ను అరెస్టు చేసినట్లు ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు.



పట్టుబడిన నిందితుడితో బరంపురం రైల్వే పోలీసులు

## ఎన్నికలకు బీజేపీ సిద్ధం

- మాజీ మంత్రి ప్రతాప్ చంద్ర షడంగి
- త్వరలోనే అభ్యర్థుల జాబితా వెల్లడిస్తామని ప్రకటన



రాష్ట్ర కార్యాలయంలో చర్చిస్తున్న బీజేపీ నేతలు

**భువనేశ్వర్:** ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఒడిశాలో లోక్‌సభ, శాసన సభ ఎన్నికలకు పూర్తిగా సిద్ధమైనట్లు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆదివారం ప్రకటించింది. పూర్తిస్థాయి ఆత్మవిశ్వాసంతో జంట ఎన్నికలను ఎదుర్కోవడానికి సర్వ అస్త్రాలు సిద్ధం చేసుకున్నామని బీజేపీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి ప్రతాప్ చంద్ర షడంగి తెలిపారు. ఎన్నికల ప్రణాళికలకు మరింత పదును పెట్టేందుకు పార్టీ అగ్రనేతలు భువనేశ్వర్‌లో తరచు సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

శనివారం రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ కీలక సమావేశం నిర్వహించి రాష్ట్రంలోని మొత్తం 147 శాసన సభ, 21 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరిపిందని వివరించారు. భ్యర్థుల జాబితాను సిద్ధం చేసి పార్టీ హైకమాండ్ పరిశీలనకు పంపుతామని, అక్కడే అభ్యర్థుల పేర్లను కేంద్ర నాయకత్వం ప్రకటించనుందని వెల్లడించారు. ఓటర్లను ఆకర్షించేందుకు ప్రణాళికలపై చర్చించినట్లు ఒడిశా బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్ తెలిపారు. ప్రచారం, అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన అన్ని అంశాలు కూలంకుషంగా చర్చించినట్లు పేర్కొన్నారు. సరైన సమయంలో అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటిస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జారీ చేసిన సందేశం ఒడిశాలోని కోటి మంది ప్రజలకు చేరవేయాలని బీజేపీ నిర్ణయించిందన్నారు. రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిటీ సమావేశమైంది. రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, పోల్ ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్, కో–ఇన్‌చార్జి లతా ఉసేండి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బిశేశ్వర్ టుడు, ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు.



ప్రతాప్ చంద్ర షడంగి, మాజీ మంత్రి

## క్లుప్తంగా

### విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి


శివశంకర్(ఫైల్)

మందస: మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో బి.శివశంకర్(21) మృతి చెందాడు. సిరిపురంలో మేడ మీద పని చేస్తుండగా, శివశంకర్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తక్షణమే సిరిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్ సిబ్బంది జి.శంకర్, వి.మురళీమోహన్ పలాసలోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### కొండపైన గిరిజనుడు మృతి


చిరంజీవి (ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని బొరిగిపేట పంచాయతీ పరిధి వంగర గ్రామానికి చెందిన పులిబంద చిరంజీవి(37) అనే వ్యక్తి కొండపైన మృతి చెందాడు. చిరంజీవి తన పశువుల మేత కోసం చెట్టు కొమ్మలు తెచ్చేందుకు గాను ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం తన గ్రామ సమీపంలోని ఉన్న కొండపైకి వెళ్లి తిరిగి రాలేదు. ఆ రోజు నుంచి గ్రామస్తులు కొండ ప్రాంతంలో గాలింపు చర్యలు చేట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ పి.పైడయ్య ఆధ్వర్యంలో వెతికినా దొరకలేదు. అయితే ఆదివారం కొంత మంది వ్యక్తులు కొండపైకి వెళ్లగా దుర్వాసన రావడంతో వెళ్లి చూడగా అక్కడ చిరంజీవి మృతదేహం గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందివ్వడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కొమ్మల కోసం వెళ్లిన చిరంజీవి తనతో తీసుకువెళ్లిన కత్తితో కొమ్మను కొడుతుండగా కత్తి విద్యుత్ లైన్‌కు తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఘటన జరిగి నాలుగు రోజులు కావడంతో అక్కడే శవ పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై అతని భార్య పులిబంధ గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు సమీప క్వారీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఘనంగా ఫేర్‌వెల్


బీఎస్సీ పారామెడికల్ విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: బొల్లినేని మెడిస్కిల్స్ బీఎస్సీ పారామెడికల్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ డ్యాన్స్‌లు, స్టెప్పులతో అదరగొట్టారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మంచిగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. పీజీ పూర్తి చేసి విదేశాల్లో ఉద్యోగావకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా సంస్థ అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయిని సాధించాలని ఆంధ్ర, తెలంగాణ, నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రవేశాలను పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్ఎన్ స్వామి, ప్రియపాల్, శ్రవణ్, రామ్మోహన్, అషేర్, ఏసుపాద ,అరుణ, దేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీఓ ఫిర్యాదు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఎంపీడీఓ ఎచ్చెర్ల పద్మజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పంచాయతీ కార్యదర్శి పి.నిర్మల, ఆమె కుమారుడిపై కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఎన్నికల కోడ్ వచ్చినందున కొత్తపేటలోని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఆదివారం మధ్యాహ్నంలోగా తొలగించాలని ఎంపీడీఓ పద్మజ పంచాయతీ కార్యదర్శి నిర్మలను ఆదేశించారు. అయితే ఆ పనిలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వహించారని ఎంపీడీఓ ప్రశ్నించారు. దీంతో కార్యదర్శిపైతో పాటు ఆమె కుమారుడు తనపై దాడికి దిగారని ఎంపీడీఓ ఫిర్యాదులో పేర్కొన్నారు.

### జిల్లా కేంద్రంలో పోలీసుల మార్చ్‌పాస్ట్


మార్చ్‌పాస్ట్ చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులోకి వచ్చినందున ఎస్ఐ బలివాడ గణేష్ ఆధ్వర్యంలోని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి నగరంలో మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. 30 మంది వరకు పోలీసు సిబ్బంది హయాతినగరం నుంచి జిల్లా పరిషత్ వరకు మార్చ్‌పాస్ట్ చేశారు. కోడ్ అమల్లో ఉన్నందున నగరంలో పౌరులు రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో తప్ప అర్ధరాత్రి దాటేవరకు తిరగరాదని అన్నారు.

# జన జాతర


బరంపురం: ఎల్లమ్మ తల్లిని మొక్కుకుంటున్న భక్తులు


బరంపురం: ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలందుకుంటున్న 12 అడుగుల పుట్ట


బరంపురం: వంటలు చేసుకుంటున్న భక్తులు

బరంపురంలోని నీలకంఠేశ్వర్ పడియా, జయపురంలోని బంకమతం ప్రాంతాల్లో ఆదివారం జరిగిన జామి ఎల్లమ్మ జాతరకు జనం పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచే భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. జోగి దండి పసుపు, కుంకుమలతో విశేష పూజలు నిర్వహించారు. – బరంపురం/జయపురం


బరంపురం: జోగితో జామి మైదానానికి వస్తున్న ఎల్లమ్మ తల్లి


జయపురం: పూజలు చేస్తున్న భక్తులు


జయపురం: ఆకట్టుకున్న సిల్లి పోతన్న


జయపురం: జోగి దండుతున్న భక్తురాలు

# ముగ్గురు యోధులు

- తొమ్మిది సార్లు గెలుపొందిన రాజకీయ ఉద్ధండులు
- ఎన్నికల చరిత్రలో ప్రత్యేకత చాటుకున్న ఖగుపతి ప్రధాన్, హబిబుల్లా ఖాన్, గిరిధర్ గమాంగ్


హబిబుల్లా ఖాన్, ఖగుపతి ప్రధాన్‌లతో ప్రధాని పి.వి.నరసింహారావు(ఫైల్)


హబిబుల్లా ఖాన్


గిరిధర్ గమాంగ్

కొరాపుట్: ఎన్నికలలో ఒకసారి గెలవడమే కష్టం. సర్వశక్తులు ఒడ్డితే గానీ విజయం వరించదు. కానీ ఆ ముగ్గురు యోధులు ఏకంగా తొమ్మిది సార్లు గెలుపొంది దేశ రాజకీయాలను ఆకర్షించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన గిరిధర్ గమాంగ్, ఖగుపతి ప్రధాన్, హబిబుల్లా ఖాన్‌లకు ఆ ఘనత దక్కుతుంది.

**ఖగుపతి ప్రధాన్:** నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి ఖగుపతి ప్రధాన్ 1967–98 మధ్య వరుసగా 9 సార్లు పోటీ చేసి గెలుపొందారు. ఒక్కసారి కూడా ఓటమి పొందలేదు. అన్నిసార్లు గెలుపొందిన తర్వాత తనకు తానే యువతకు అవకాశం ఇవ్వాలనే ఆశయంతో పోటీ చేయలేదు. తొలుత ఈయన విశాఖపట్నంలో ఆంధ్రా యునివర్సిటీలో విద్యనభ్యసించి ఒడిశాలో ఎస్ఐగా విధులు చేరారు. విద్యావంతుడికి టికెట్ ఇవ్వాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ బరిలో దింపింది. నాటి నుంచి రాజకీయ విరమణ చేసే వరకు అదే పార్టీలో గెలుపొందుతూ వచ్చారు. ఏనాడూ భువనేశ్వర్ వెళ్లడం గానీ, పీసీసీ కార్యాలయాన్ని సందర్శించడం గానీ చేయలేదు. కేవలం కేంద్ర రాజకీయాలకు మాత్రమే పరిమితమయ్యేవారు. ఇటు విశాఖపట్నం, అటు రాయ్‌పూర్ మీదుగా న్యూఢిల్లీ వెళ్లి వచ్చేవారు. అప్పట్లో ఖగుపతి పీసీసీ కార్యాలయం సందర్శించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎస్ఆర్‌టీసీ బస్సుల్లో ఎంపీ, ఎమ్మెల్యే సీటు రిజర్వేషన్ పెట్టేది. దాంతో ఖగుపతి విశాఖపట్నం నుంచి ఆర్టీసీ నబరంగ్‌పూర్‌కి వచ్చి వెళ్లేవారు. తమకు ఆంధ్ర బస్సులో రిజర్వేషన్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటించారు.

**హబిబుల్లా ఖాన్:** నబరంగ్‌పూర్ జిల్లాకు హబిబుల్లా ఖాన్‌తో విడదీయరాని బంధం ఉంది. 1971 నుంచి 2004 వరకు హబిబుల్లా ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఏనాడూ ఓటమి చెందలేదు. 2009లో ఈ స్థానం రిజర్వుడ్‌గా మారడంతో పోటీ చేయలేకపోయారు. రాష్ట్ర రాజకీయాల్లో హబిబుల్లా ప్రత్యేక స్థానం పొందారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ హబిబుల్లాకు అతను కోరిన విధంగా రెండు క్యాబినెట్ మంత్రి పదవులు కట్టబెట్టేది. గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండేవారు. ఓసారి ఇందిరా గాంధీ నబరంగ్‌పూర్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు హబిబుల్లాను పిలిచి మాట్లాడారు. నియోజకవర్గంలో ముస్లింలు కేవలం 0.7 శాతం ఉండగా ప్రతిసారి గెలుపు ఎలా సాధ్యమని ప్రశ్నించగా.. ఆయన మౌనంగా ఉండిపోయారు.

**గిరిధర్ గమాంగ్:** కొరాపుట్ లోక్‌సభ స్థానం గిరిధర్ గమాంగ్ కాంగ్రెస్ తరఫున తొమ్మిది సార్లు గెలుపొందారు. మధ్యలో గిరిధర్ రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో ఈ స్థానంలో 1999లో అతని భార్య హేమావతి గమాంగ్ ఎంపీగా గెలుపొందారు. ఈ కుటుంబం మొత్తం 10 సార్లు ఇక్కడి నుంచి గెలుపొందడం విశేషం. 1972 నుంచి 2004 వరకు ఈ జైత్ర యాత్ర కొనసాగింది. అనంతరం ఓటమి చవిచూశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చేటప్పుడు గిరిధర్‌కి కేంద్ర మంత్రి పదవి వచ్చేది. గాంధీ కుటుంబానికి గిరిధర్ నమ్మకస్తులు. ఎమర్జెన్సీ అనంతరం కాంగ్రెస్ పార్టీ దయనీయ స్థితిలో ఉన్నప్పుడు గిరిధర్ మాత్రం ఇందిరా గాంధీకి అందుబాటులో ఉంటూ అత్యంత నమ్మకమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు.

**ముగ్గురిలో సారుప్యత..**

గిరిధర్, ఖగుపతి, హబిబుల్లాల్లో ఒకే లక్షణాలు కనిపిస్తాయి. ముగ్గురూ అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన వారు. ముగ్గురూ తెలుగు భాషను అనర్గళంగా మాట్లాడుతారు. వీరు అధికారంలో ఉన్నప్పుడు తెలుగు ప్రజలకు అండగా ఉండేవారు. ఈ ముగ్గురు విజయాలు కాంగ్రెస్ పార్టీ నుంచే కొనసాగడం విశేషం. కారణాలు ఏమైనా వీరి గెలుపు తొమ్మిది సార్లుతో ఆగిపోవడం గమనార్హం..

# నేచర్ ట్రయల్ పార్కు ప్రారంభం


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: జిల్లా కోర్టు సమీపంలోని పినాకి సంరక్షిత అడవిలో నేచర్ ట్రయల్ పార్క్‌ను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి శనివారం ప్రారంభించారు. సారావీధిలోని బసంతి మందిర సమీపంలో కమ్యూనిటీ హాల్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం డొంగాగుడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, జయపురం డివిజన్ ఫారెస్ట్ అధికారి ప్రతాప్ బెహరా, అటవీ రేంజ్ అధికారి సచ్చిదానంద పారిడ, మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో, జూనియర్ ఇంజినీర్ అజయ జాని, ప్రతాప్ చంద్ర ఆచార్య పాల్గొన్నారు.

# వాయిద్య పరికరాల వితరణ


పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

జయపురం: జయపురం సమితి కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం స్వతంత్ర వికాస పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని 44 భక్తి సంకీర్తన బృందాలకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వాయిద్య పరికరాలను వితరణ చేశారు. కార్యక్రమంలో బీడీఓ శక్తి మహపాత్రో, అధ్యక్షురాలు త్రిలోచన ముదులి, జిల్లా పరిషత్ సభ్యులు తిపతి పట్నాయిక్, రశ్మి రథ్, ఎస్‌డీసీ సభ్యులు టంకుధర హల్వ, బైద్యనాథ్ నాయిక్ పాల్గొన్నారు.

# రాష్ట్రానికి వడగళ్ల వాన సూచన

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందస్తు సమాచారం జారీ చేసింది. మరికొన్ని ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉంటుందని పేర్కొంది. దీని ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒకటి లేదా రెండు చోట్ల గణనీయంగా తగ్గి ఇతర చోట్ల పెద్దగా మార్పు ఉండదని తెలిపింది. తీర ప్రాంత ఒడిశా జిల్లాల మీదుగా కొన్ని చోట్ల సాధారణం కంటే తక్కువ, అంతర్గత ఒడిషా జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొంది. 19న ఢెంకనాల్, కటక్, నయాగఢ్, కంధమల్, గంజాం, కలహండి, బొలంగీర్, రాయగడ, నవరంగ్‌పూర్, అంగుల్, ఖుర్దా జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, గంజాం, గజపతి, దేవ్‌గఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్, కొరాపుట్, మల్కన్‌గిరి, సోన్‌పూర్, సంబల్‌పూర్, అంగుల్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల గాలి వేగం గంటకు 30 నుంచి 40 కిలో మీటర్లు ఉంటుందని పేర్కొంది. 20న, కటక్, నయాగఢ్, ఖుర్దా, కంధమల్ ప్రాంతాలలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించింది. సోమవారం దేవ్‌గఢ్, సుందర్‌గఢ్, ఝార్సుగుడ, సంబల్‌పూర్, కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపాడ, కటక్, జగత్‌సింగ్‌పూర్, అంగుల్, ఢెంకనాల్‌లో మెరుపులు, ఉరుములతో కూడిన వానలు కురవవచ్చని పేర్కొంది.

### ఆదిత్యుని సన్నిధిలో సందడి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు సూర్యోదయ సమయానికి పుష్కరిణి ఆవరణలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఏర్పాట్ల విషయంలో కూడా ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి వారి మూలవిరాట్టును అలంకరించి దర్శనానికి అనుమతించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,02,300, విరాళాల ద్వారా రూ.88,790, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.95 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలిపారు. ఆలయ పాలకమండలి సభ్యులు ఎస్.కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావుతో పాటు సింహాచలం దేవస్థాన పాలకమండలి సభ్యులున్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన భగిరథి సరక

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో దొందిలి గ్రామానికి చెందిన భగిరథి సరక అనే యువకుడికి గాయాలయ్యాయి. కొలనార నుంచి జేకేపూర్ వైపు ఆటోను డ్రైవ్ చేసుకుంటూ వస్తున్న సరకకు ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో సరక తీవ్ర గాయాలు కాగా, ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# న్యాయ చట్టాలపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న సుమన్ జెనా

జయపురం: ప్రతిఒక్కరూ న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత చైర్మన్ సుమన్ జెనా అన్నారు. జయపురం సమితి టంకువ పంచాయతీ పనసపుట్‌భగర గ్రామంలో ఆదివారం ఆదివాసీ, ఎస్సీ ప్రజలకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమాజ సేవి దీప్తి నాయిక్, పోస్కో స్పెషల్ కోర్టు పీపీ డాక్టర్ గాయిత్రీదేవి, సిబ్బంది శ్రీకాంత దండసేన, దేవేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వెంకట నరేంద్ర 'గేట్'లో 724వ ర్యాంక్



విజయనగరం అర్బన్: పబ్లిక్ సెక్టార్‌లో ఉన్నతస్థాయి ఉద్యోగాలకు, ప్రతిష్టాత్మకక ఇంజినీరింగ్ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు చేపట్టే 'గేట్' పోటీ పరీక్షలో విజయనగరం పట్టణానికి చెందిన కొట్యాడ వెంకట నరేంద్ర 724వ ర్యాంక్ సాధించాడు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 620 స్కోర్ తెచ్చుకోవడంతో ఈ ర్యాంక్ లభించిందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. రాష్ట్రంలోని ఎన్‌ఐటీలో మూడో సంవత్సర ఇంజినీరింగ్ చదువుతున్న వెంకట ప్రసాద్ పట్టణంలోని కేంద్రీయ విద్యాయలంలో ఇంటర్మీడియట్ చదివాడు. తండ్రి వెంకట ప్రసాద్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి గంగలక్ష్మి గృహిణి. తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంక్ తెచ్చుకున్నందుకు పలువురు అభినందనలు తెలిపారు.

### అలరించిన ఉత్తరాంధ్ర స్థాయి నాటిక పోటీలు



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న హరిబాబు

రాజాం సిటీ: అంతరించిపోతున్న కళారంగాన్ని బతికించుకునేందుకు కళాకారులు పడుతున్న తపన ఎనలేనిదని గ్రంధి హరిబాబు అన్నారు. రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఎస్‌వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉత్తరాంధ్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వెండితెర, బుల్లితెరల ప్రభావంతో నాటకరంగం అంతరించి పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీన్ని బతికించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మంచి నాటకాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందన్నారు. అనంతరం ప్రదర్శించిన ఏకపాత్రాభినయ పోటీలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్,అర్నిపల్లి వెంకటినాయుడు, మక్క అప్పలనాయుడు, పెంకి గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సారా ధ్వంసం

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన సారాను ఏఎస్పీ సునీల్ షరోన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గతంలో స్వాధీనం చేసుకున్న 18 సారా కేనల్లో ఉన్న 1502 లీటర్ల సారాను ధ్వంసం చేశామన్నారు. సారా రవాణా, అమ్మకాలు, తయారీ వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పీవీవీఎస్ఎన్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



బొండపల్లి: మృతి చెందిన దేవుడు



బొబ్బిలి: పార్వతి మృతదేహం

బొండపల్లి/చీపురుపల్లి రూరల్ (గరివిడి), బొబ్బిలి: విజయనగరం జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఆయా ప్రమాదాలకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెలిమర్లలోని రామతీర్థం జంక్షన్‌కు చెందిన ఆటో డ్రైవర్ యాండ్రాపు దేవుడు (36) బొండపల్లి మండలంలోని నెలివాడ సమీపంలో రాజు చెరువులో చేపలు తీసుకుని స్వగ్రామం వెళ్లిపోతుండగా నెలివాడ జాతీయ రహదారి26పై పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ దేవుడుని 108 వాహనంలో విజయనగరం లోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా సర్వజన ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరో ప్రమాదంలో శ్రీకాకుళం రైల్వే రోడ్డు పరిధిలో గరివిడి-నెల్లిమర్ల మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మూడు రోజుల క్రితం ఈ ప్రమాదం జరిగి ఉంటుందని నిద్రమత్తులో రైలు నుంచి జారిపడి ఉండొచ్చనని రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుని వయస్సు 50 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. వివరాల కోసం ఫోన్9491106219 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే బొబ్బిలి పట్టణంలోని పట్టణంలోని పూల్‌భాగ్ రోడ్డులో నడిచి వెళ్తున్న మహిళను వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందింది. మృతురాలిని బొబ్బిలిలోని గొల్లవీధికి చెందిన కొల్లి పార్వతి(54)గా గుర్తించారు. మృతురాలికి నలుగురు వివాహితులైన పిల్లలు ఉన్నారు. ఆమె భర్త ఐదేళ్ల కిందట మృతిచెందాడు.

# దేవతలారా దీవించండి

- వైభవంగా కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మ జాతరల ప్రారంభం
- తెల్లవారుజామున 2 గంటల నుంచే ప్రారంభమైన దర్శనాలు
- మధ్యాహ్నం 12 గంటల వరకు బారులు తీరిన భక్తులు
- పసుపు, కుంకుమలతో మొక్కుల చెల్లింపు
- చీపురుపల్లిలో దర్శించుకున్న జెడ్పీచైర్మన్, ఎంపీ



జామి: అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



జామి: లక్ష్మీ స్వరూపిణిగా దర్శనమిచ్చిన యల్లారమ్మ అమ్మవారు

చీపురుపల్లి/జామి: భక్తుల కొంగు బంగారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవం, జామి మండల కేంద్రంలో ఎల్లారమ్మ జాతర ఆదివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కనకమహాలక్ష్మి, ఎల్లారమ్మా.. కరుణించండంటూ భక్తుల నామస్మరణతో ఆ రెండు ఆలయాలు మార్మోగిపోయాయి. ఏటా మహాశివరాత్రి తరువాత జరిగే శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర కోసం వేచి ఉన్న భక్తులు జాతర ప్రారంభమవడంతో ఆడపిల్లలు, బంధువులను పిలిచి పండగ జరుపుకున్నారు. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వజాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశ్(గోవింద్), వైస్ చైర్మన్ సూరు కుమార్‌లు దంపతులతో సహా తొలిపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు దర్శనం చేసుకున్నారు. తెలవారుజామున 2 గంటలకు ప్రారంభమైన దర్శనాలు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం దేవాదాయశాఖ రూ.100, రూ.50, రూ.20 టిక్కెట్లు క్యూలు ఏర్పాటు చేసింది. వీటితో పాటు ఉచిత దర్శనాలు కూడా కల్పించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పాటు కోళ్లు, మేకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతేకాకుండా ప్రత్యేక మొక్కులు ఉన్న వారు ప్రభలు కట్టి మోసుకుంటూ అమ్మవారి దేవస్థానానికి చేరుకుని దర్శనం చేసుకున్నారు. మహిళా భక్తులు రావిచెట్టు, ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించారు. జాతర ప్రారంభం సందర్భంగా ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు తలెత్తకుండా డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి పర్యవేక్షణలలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



జామి: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



చీపురుపల్లి: పూజలు అందుకుంటున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులు



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దంపతులు

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..**

ఇదిలా ఉండగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులతో పాటు వారి కుమార్తె సిరిసహస్ర, కుమారుడు మోహిత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులతో పాటు కుమారుడు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పావని దంపతులు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

**ఎల్లారమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కడుబండి**

ఎల్లారమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కరుణాకటాక్షాలు ఎస్.కోట నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ప్రార్థించారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు.జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

# సచివాలయ ఉద్యోగి మృతి

- ఆదుకోవాలని కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం ఆదేశం

దేవరాపల్లి: అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయం పరిధి ములకలాపల్లిలో ఆదివారం ఉదయం విద్యుత్ ఘాతానికి గురై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ డెక్క చిరంజీవి (34) మృతిచెందాడు. ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లెక్సీలు తొలగిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆ రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లి గ్రామానికి చెందిన చిరంజీవి మృతితో కుటుంబసభ్యులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయారు. మృతుడికి తల్లి కృష్ణమ్మతోపాటు భార్య హేమలత, పిల్లలు చేతన్(6), ఇషాన్(3) ఉన్నారు. మృతుడి తండ్రి పదేళ్ల క్రితం మరణించగా, తల్లి అనారోగ్యంతో మంచానపడ్డారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న చిరంజీవి మృతితో తమకు దిక్కెవరంటూ భార్య రోదించిన తీరు పలువురి హృదయాలను కలిచివేసింది. డ్యూటీకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయావా, ఇప్పుడు పిల్లలను ఎలా పోషించాలంటూ విలపించడం పలువుర్ని కంటతడి పెట్టించింది. మండలంలోని సచివాలయ ఉద్యోగులతోపాటు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నాగేంద్ర తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారు. డిప్యూటీ సీఎం పరామర్శ వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిరంజీవి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రమాదం తీరును కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, గొర్లి కొండలరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మిలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కలెక్టర్ రవిపట్టన్ శెట్టిని ఫోన్‌లో కోరారు.

# వైశ్యులంటే అపారమైన గౌరవం

- ఎల్లప్పుడూ అండగా ఉంటాం
- ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బొత్స



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వేదికపై ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు తదితరులు

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్యవైశ్యులకు పలు రకాలైన పదవులు ఇచ్చి వారికి ప్రత్యేకమైన ప్రాధాన్యం కల్పించారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యలు అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి గజపతినగరం మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మంటపంలో నిర్వహించిన మండలస్థాయి ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో గజపతినగరంలో ఏఒక్క ఆర్యవైశ్యునికి ఎటువంటి సమస్య రాకుండా చూసుకున్నామని, అదేవిధంగా మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తరువాత గజపతినగరం, పురిటి పెంట మేజర్ పంచాయతీలను అభివృద్ధి స్థాయి జంట నగరాలుగా తీర్చి దిద్ది ప్రజల మన్ననలను పొందుతామని చెప్పారు. ఏ ఒక్క మంచి కార్యక్రమం తలపెట్టినా ఆర్యవైశ్యులతో మొదలుపెట్టడం అలవాటుగా వస్తోందని, ఆ దిశగా ఈరోజు ఈరకంగా ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో కలవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే గజపతినగరంలో కల్యాణ మంటపం కోసం స్థల సేకరణ, శ్మశాన వాటిక, మరుగుదొడ్లు, తదితర అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి అన్నిరకాలుగా ఆదుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) జెడ్పీటీసీ గారతవుడు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి శంకరరావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్, కె.సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, కె.ఆదినారాయణ, పి.నారాయణ మూర్తి, కె.రామునాయుడులతో పాటు స్థానిక ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

# 'భోజనం' భేష్

- ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం
- మినరల్ వాటర్
- విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం
- 20 వేల మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం



బాలికల ఆశ్రమ పాఠశాలలో మినరల్ వాటర్ సదుపాయం



సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు నాణ్యమైన సరుకులు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. విద్యార్థులకు వండి వడ్డించడానికి బ్రాండెడ్ సరుకులను సప్లై చేస్తున్నారు. పామాయిల్ స్థానంలో సన్‌ఫ్లవర్ ఆయిల్, అకోలా కంపెనీకి చెందిన కందిపప్పు, ట్రిబుల్ హార్స్ మినపగుళ్లు, బన్సీ రవ్వ, ఇడ్లీ నూక, గోధుమ పిండి తదితర నాణ్యమైన సరుకులు అందిస్తున్నారు. వసతిగృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు మంచిగా చదువుతూ.. ఆరోగ్యంగా ఉండేందుకు వీలుగా రోజూ నాణ్యమైన మెనూ అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతీ మూడు నెలలకు జీసీసీ ఆధ్వర్యంలో సరుకుల సరఫరాకు టెండర్లు సైతం నిర్వహిస్తున్నారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, మరో 23 రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, 32 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. దాదాపు వీటిలో 20 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

| తరగతి | గతంలో కేటాయింపు | ప్రస్తుతం కేటాయింపు |
|---|---|---|
| 3 నుంచి 4 | రూ.1000 | రూ.1150 |
| 5 నుంచి 10 | రూ.1250 | రూ.1450 |
| ఇంటర్మీడియెట్ ఆపైన | రూ.1400 | రూ.1600 |

### పక్కాగా అమలుకు చర్యలు



మెనూ పక్కాగా అమలుకు చేయడం జరుగుతుంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గతంతో పోలిస్తే డైట్ చార్జీలు పెంచడంతో పోషకాహారంతో కూడిన మెనూ విద్యార్థులకు అందజేస్తున్నాం. అదనంగా చక్కీలు, పండ్లు వంటివి ఇస్తున్నాం.

– అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ, సీతంపేట

### రుచికరమైన భోజనం



అన్ని విధాల చదువుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మంచి మెనూ అందిస్తున్నారు. ఇదివరకటి కంటే ఇప్పుడు పెంచిన నిధులతో ఇంకా రుచికరమైన భోజనం పెడుతున్నారు.

– పి.లక్ష్మి, 9 వతరగతి, బాలికల ఆశ్రమ పాఠశాల, సీతంపేట

### కార్పొరేట్ తరహా విద్య



గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందించడం జరుగుతుంది. నాడు – నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారాయి. వాటితో పాటు సరైన మెనూ అందిస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం జరుగుతుంది. గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జగనన్న ఆణిముత్యాలు కూడా దోనుబాయి విద్యార్థికి వచ్చింది.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

### మెనూ ఇలా...

- **ఆదివారం:** అల్పాహారం: పూరి, బంగాళాదుంప, బఠాణి కుర్మ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
**మధ్యాహ్నం:** చికెన్ బిర్యాని, పెరుగుపచ్చడి, గోంగూర చట్నీ
**సాయంత్రం:** సేమ్యా పాయసం, అరటిపండు
**రాత్రి:** అన్నం, సాంబార్, క్యారెట్ పెసరపప్పు కూర, బటర్ మిల్క్
- **సోమవారం:** అల్పాహారం: పులిహోరా, రోస్టెడ్ బెంగాల్ గ్రామ్ దాల్‌పౌడర్, ఉడకబెట్టిన కోడిగుడ్డు
**మధ్యాహ్నం:** అన్నం గోంగూర పప్పు, కాయగూర, పెరుగు
**సాయంత్రం:** ఉడకబెట్టిన గుగ్గిళ్లు, జామ/స్థానికంగా లభించే పండు
**రాత్రి:** అన్నం, క్యాబేజీకూర, రసం, మజ్జిగ
- **మంగళవారం:** అల్పాహారం: ఇడ్లి, వేరుశనగ చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
**మధ్యాహ్నం:** అన్నం, పాలకూర పప్పు, కాయగూర, పెరుగు
**సాయంత్రం:** రాగి లడ్డు, అరటిపండు
**రాత్రి:** బగార రైస్, చికెన్ కర్రి, గోంగూర చట్నీ, పెరుగుపచ్చడి
- **బుధవారం:** అల్పాహారం: జీరా రైస్, కాయగూర, ఉడికించిన కోడిగుడ్డు
**మధ్యాహ్నం:** అన్నం, వంకాయకూర, మెంతికూర పప్పు, పెరుగు
**సాయంత్రం:** ఉడకబెట్టిన బొబ్బర్లు, జామ/లోకల్ ఫ్రూట్
**రాత్రి:** అన్నం, బెండకాయ, సాంబారు, మజ్జిగ
- **గురువారం:** అల్పాహారం: బస్మతి రవ్వ ఉప్మా, వేరుశనగ చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
**మధ్యాహ్నం:** అన్నం, పాలకూరపప్పు, కాయగూర, పెరుగు
**సాయంత్రం:** మరమరాల మిక్సర్, అరటి పండు
**రాత్రి:** అన్నం, చిక్కుడుకాయ వేపుడు, సాంబార్, మజ్జిగ
- **శుక్రవారం:** అల్పాహారం: హాట్ పంగల్, దాల్ పప్పు చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు
**మధ్యాహ్నం:** అన్నం, మెంతికూర పప్పు, బంగాళదుంప, పెరుగు
**సాయంత్రం:** ఉడకబెట్టిన శనగలు, జామ/లోకల్ ఫ్రూట్
**రాత్రి:** అన్నం, గుత్తివంకాయ కూర, మజ్జిగ
- **శనివారం:** అల్పాహారం: ఇడ్లీ, వేరుశనగ చట్నీ
**మధ్యాహ్నం:** అన్నం, పాలకూర పప్పు, క్యాబేజీ కూర, పెరుగు
**సాయంత్రం:** రవ్వ కేసరి, అరటి పండు
**రాత్రి:** అన్నం, దొండకాయ కూర, సాంబార్, బట్టర్ మిల్క్,
- ఆదివారం తప్ప మిగతా రోజుల్లో ఉదయం పాలు, ఉదయం విశ్రాంతి సమయంలో స్నాక్స్ కింద మల్టీమిల్లెట్ చక్కీలు ఇవ్వాలి.

# 'గురుదేవా'లో రూ 2.50కోట్లతో కేన్సర్ ఆస్పత్రి

- గురుదేవాలో దివ్యాంగులకు అందుతున్న సేవలు అమోఘం
- ప్రవాస భారతీయుడు ఉప్పలపాటి రాజు



గురుదేవా ఆధ్వర్యంలో తయారు చేస్తున్న కృత్రిమ అవయవ తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న ప్రవాస భారతీయుడు ఉప్పలపాటి రాజు

కొత్తవలస : మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆవరణలో రూ 2.50 కోట్లతో వంద పడకల కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. ప్రవాస భారతీయుడు యూఎస్ఏకు చెందిన ఉప్పలపాటి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో దీన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి రాజు ఆదివారం ట్రస్టును సందర్శించి ట్రస్టు ద్వారా ప్రస్తుతం అందుతున్న సేవలను, కృత్రిమ అవయవాలు తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంత రం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడు తూ తన భార్య డాక్టర్ విజయ కేన్సర్ వ్యాధితో బాధపడుతూ సరైన వైద్యం అందక మృతి చెందారని గుర్తుచేశారు. దీంతో ఆమె జ్ఞాపకార్థం స్వదేశంలో ఉచిత కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు సంకల్పించానని తెలిపారు. గురుదేవా ట్రస్టు చేస్తు న్న సేవలను తెలుసుకొని తద్వారా తన సంకల్పం నెరవేర్చుకోవచ్చని తెలిసి ఇక్కడ రూ. 2.50కోట్లతో కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ముందుకు వచ్చానని తెలిపారు. ప్రస్తుతం గురుదేవా ట్రస్టు ద్వారా దివ్యాంగులకు, అభాగ్యులకు అందుతున్న సేవలు అభినందనీయమన్నారు. తన జీవితాన్నే దివ్యాంగుల సేవలకు అంకితం చేసిన ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆదర్శప్రాయుడని కొనియాడారు. ముందుగా 20 మంది దివ్యాంగులకు ఉచిత కృత్రి మ కాళ్లు, చేతులు, బ్లైండ్ స్టిక్స్, వినికిడి యంత్రాలు అందజేశారు. 50 మంది వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. 60 మంది పసిపిల్లలకు జాన్సన్ బేబీ కిట్స్, ఫీడింగ్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర ఫణికుమార్ పాల్గొన్నారు.

# భవిష్యత్తుపై ప్రభావం చూపే తప్పిదాలు చేయొద్దు

- పదో తరగతి రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు



పది పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు

విజయనగరం అర్బన్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థికి ప్రశాంత వాతావరణ కల్పిస్తూ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్షల నిర్వహణ జరగాలని రాష్ట్ర పరిశీలకుడు వి.ఎస్.సుబ్బారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక డీఈఓ కార్యాలయంలో పది పరీక్షల స్క్వాడ్‌లతో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్తుపై ప్రభావం చూపే తప్పిదాలు జరగనీయకుండా పర్యవేక్షణ చేపట్టాలని, ఆ దిశగా సిబ్బంది పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం పట్టణంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలు, తరగతి గది పరిసరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట డీఈఓ ఎన్.ప్రేమకుమార్, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజు తదితరులు ఉన్నారు.

# ప్రారంభమైన పోలిపల్లి పైడితల్లి జాతర

రాజాం సిటీ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున ఆలయ మేనేజర్ బీవీ మాధవరావు తొలి పూజ చేసి జాతరను ప్రారంభించారు. ప్రతి ఏటా జరుగుతున్నట్లే పారిశ్రామికవేత్త పొట్టా కల్యాణ్‌చక్రవర్తి పూజలు చేసి హుండీని, చెలికాని బదరీనారాయణ టిక్కెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో పాటు నూతన వస్త్రాలను డాక్టర్ పీఎల్ఎన్ రాజు (రఘు) అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, సర్కస్‌లు, రంగుల రాట్నాలు ఆకట్టుకున్నాయి. రాజాం టౌన్, రూరల్ సీఐలు డి.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, పోలీసులు భద్రతా ఏర్పాట్లు నడుమ మొదటి రోజు జాతర ప్రశాంతంగా జరిగింది.